# ఘంటసాల

సరిత్పతి గొప్ప పురోహితుడు. మన పురోగతికి హితము చెప్పేవాడే పురోహితుడంటే. వివాహాది శుభకార్యాలకి సరిత్పతినే పిలుస్తారు. విఘ్నేశ్వరపూజ ఆయనే చేయించాలి. ఆయన విఘ్నేశ్వర పూజ చేయిస్తే సమస్త విఘ్నాలు తొలగిపోతాయేమో అనిపిస్తుంది. సరస్వతీపూజ చేయిస్తే మనలో ఉన్న జాడ్యం నశించి మూగవాడు సైతం మాటకారి అవుతాడేమో అనిపిస్తుంది! అందరికీ ఆదరణీయుడాయన. సత్యనారాయణ వ్రతం చేయించాలంటే సరిత్పతికేవెల్లు. ఆయన లాగ పదవిచ్ఛేదనం చేస్తూ స్పష్టంగా మంత్రాలను ఉచ్చరించడంలో ఆయనకి సాటిలేరెవ్వరూ. ఏ మాత్రం చదువుకున్న వారికైనా ఆయన ఉచ్చరించే మంత్రార్థం సరళతరమూ సులభగ్రాహ్యమూను. ఏ దేవుడి మీద మంత్రం చదివితె ఆ దేవుడు ప్రత్యక్షమవుతాడేమో అనిపిస్తుంది. ఏ దేవిని స్తుతిస్తే ఆ దేవి పలుకుతుందేమో అనిపిస్తుంది.

అటువంటి సరిత్పతికి ప్రజల్లో పలుకుబడి ఇంకా ఎక్కువైంది. నూట పదహార్రూపాయలకి చేయించే సత్యనారాయణ వ్రతానికి మరో వెయ్యి చేరిస్తేకాని రావడం మానేశాడు. ప్రతి శుభకార్యానికి పదింతలు రేటు పెంచేశాడు. సైకిలమ్మేసి స్కూటరుకొన్నాడు. ఇంటికి ఫోను పెట్టించాడు. ఇవాళ్టికివాళ రమ్మంటే వచ్చే స్థితిలో లేడాయన. ఇంతవరకూ బస్సులకీ రైళ్లకీ ముందుగా రిజర్వేషన్ చేయించుకున్నవాళ్లు, శుభకార్యాలకీ వ్రతాలకీ చేయించుకునే పరిస్థితి వచ్చింది ప్రజలకి.

మధ్యతరగతికి దిగువనున్న వారికి సరిత్పతిగారి రేటు దూరమై పోయింది.

సరిత్పతికి పౌరోహిత్యం వున్నకొన్నిళ్లవాళ్ళు - "బాబూ! తమరింతగా రేట్లు పెంచేయడం భావ్యంకాదు!" అని విన్నవించుకున్నారు.

"ఏమిటండీ భావ్యంకాదు? నేను విద్వాంసుణ్ని కానా? నాకు అంతఛార్జీ చేసే అర్హతలేదా?" అని ఎదురుప్రశ్న వేశాడు సరిత్పతి.

"తమకి అర్హతలేదని అనలేదు బాబూ! నిజానికి ఈ మూడు జిల్లాల్లోను తమవంటి పండితుడే లేడు. కాని మాకు అంత డబ్బు ఖర్చుపెట్టే శక్తిలేదు బాబూ! తమరు కాస్త మమ్మల్ని కనికరించాల" అని మొరపెట్టుకున్నారు.

'లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె' అని గజేంద్రుడు మొరపెడితే, రక్షించడానికి విష్ణుమూర్తి వచ్చాడు. సరిత్పతి ఏమైనా విష్ణువా వీళ్ల మొర వినడానికి? అతడొక సామాన్య మానవుడు. అంతే!

"చూశారుకదా? ఇంటికి టెలిఫోను పెట్టించాను. దానికి నెలకి ఐదారు వందలు బిల్లు చెల్లించాలి. స్కూటరు మీద మీ ఇళ్లకు రావాలంటే పెట్రోలు ధర ఎలా మండిపోతున్నదో గమనిస్తున్నారు కదా? అంచేత నేను వెయ్యినూట పదహార్లకి ఒక్కపైసా కూడా తగ్గించలేను" అని నిష్కర్షగా చెప్పేశాడు సరిత్పతి.

మరో పురోహితుణ్ని తక్కువ రేటుకి పెట్టుకున్నా, సరిత్పతిలా 'మంత్ర' ముగ్ధుణ్ణి చేసే శక్తి ఎవరికుంది? గత్యంతరం లేక సరే అని ఒప్పేసుకున్నారు వాళ్ళు.

ఒకాయన వినాయకవ్రతం చేయించి సరిత్పతికి వెయ్యి నూట పదహార్లు సమర్పించుకున్నాడు.

త్రినాథవ్రతం చేయించి వెయ్యినూట పదహార్లు సమర్పించుకున్నాడు ఇంకొకాయన. సత్యనారాయణవ్రతం చేయించి అదే మొత్తం సమర్పించుకున్నాడు మరొకాయన. దేవీ నవరాత్రులలో వెయ్యి నూట పదహార్లిచ్చుకుని పూజ చేయించుకున్నాడొకాయన. కార్తిక సోమవారం నాడు రుద్రాభిషేకం చేయించు కున్నాడింకొకాయన. 'సరస్వతీ నమస్తుభ్యం' అని వేరొకాయన పుస్తకాల పూజ చేయించుకున్నాడు.

ఇలాగ రకరకాల వ్యక్తులు రకరకాల పూజలు చేయించుకున్నారు సరిత్పతిచేత. సరిత్పతికి పది పదిహేను వేలకుపైగా దుడ్డు ముట్టింది. బ్యాంకు బ్యాలెన్సు పెరిగిపోయింది.

కాని దురదృష్టం ఏమిటంటే, సరిత్పతిని మరెవ్వరూ వ్రతాలకు పిలవడం మానేశారు. ఫోన్ కాల్స్ బంద్ అయిపోయాయి. ఫోన్ డిస్కనెక్టు అయిపోయింది. బ్యాంకు బ్యాలెన్సు తరిగిపోయింది. స్కూటరమ్మేసి మళ్ళీ సైకిలు కొన్నాడు.

ఈ సంవత్సరం ఎవరు ఏ తిథినాడు వెయ్యి నూటపదహార్లిచ్చి వ్రతం చేయించుకున్నారో మరుసటి సంవత్సరం అదే తిథినాడు సరిత్పతిని మళ్ళీ వ్రతానికి పిలవాలా? లేదు!

సరిత్పతి డబ్బుకి కటకటలాడిపోయాడు.

తనకి వాడుకగా పౌరోహిత్యం వున్న ఇళ్ళకి తన సైకిలాశ్వం మీద ప్రయాణమయ్యాడు. కారణం దరియాప్తు చేశాడు.

"ఏం చెయ్యమంటారయ్యా! తమకు వెయ్యి నూట పదహార్లిచ్చుకోలేక మానేశాం. అయినా తమరే మా చేత వ్రతం చేయించారు" అన్నాడొకాయన.

"ఇదేమిటి? ఓ పక్కనున్న పిలవలే దంటున్నారు. మరో పక్క నేను వ్రతం చేయించానంటున్నారు. నాకేమీ అంతుపట్టడం లేదు" అన్నాడు సరిత్పతి.

"మీరు మా ఇంట్లో వ్రతం చేయించినప్పుడు మీకు తెలియకుండా టూ-ఇన్-వన్ ద్వారా మీ గొంతుకను రికార్డు చేసుకున్నాం. గత సంవత్సరం మీకు వెయ్యి నూట పదహార్లిచ్చిన వాళ్ళందరం అదే చేశాం. తరువాత ఒకళ్ళొకళం కేసెట్ల ద్వారా మీ చేత చేయించుకున్న అన్ని వ్రతాలనూ రికార్డు చేసుకున్నాక మార్పిడీ చేసుకున్నాం" అన్నాడాయన.

సరిత్పతి ఖంగుతిన్నాడు.

"బాబూ! మునుపటి నూట పదహార్లకే వ్రతం చేయించేస్తాను. నన్ను క్షమించండి!" అన్నాడు.

"నిజమేనండీ! మీరు వున్నంతకాలమే కదా మిమ్మల్ని పిలిచేది? మీ అనంతరం మీ గొంతుక మాకెలా వస్తుంది? ఘంటసాలవారు కాలం చేసినా ఆయన పాడిన సినిమా పాటల్ని, గీతా శ్లోకాల్ని, కరుణశ్రీ రాసిన పుష్పవిలాప పద్యాల్ని, ఏ విధంగా రికార్డుల ద్వారా పొందుపరిచారో అదే విధంగా మీ అనంతరం కూడా మీ అమూల్యమైన మధుర కంఠాన్ని కేసెట్ల ద్వారా పొంద పరుచుకున్నాం!" అన్నాడాయన.

• ఆదివారం ఆంధ్రభూమి •

*29 మార్చి 1992*